# ఎర్ర మిరప.. రైతులకు ఆదాయ పంట


కాంబల్లెలో సాగు చేసిన ఎర్ర మిరప పంట


కుప్పపోసిన ఎర్ర మిరప కాయలు

- ఎర్ర మిరప క్వింటా రూ.30 వేలకు పైమాటే
- ఆనందంలో మిరప రైతులు

**సింహాద్రిపురం** : మండల పరిధిలోని రెండు చోట్ల రైతులు పండించిన ఎర్ర మిరప పంట రైతులకు ఆదాయ పంటగా మారింది. ఈ బ్యాడిన్ మిరప విదేశాలకు ఎగుమతి అవుతుండటంతోపాటు ధర బాగా ఉండటంతో రైతుల పాలిట ఎర్ర బంగారంగా మారింది. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు గడించవచ్చునని రైతులు నిరూపించారు. నూతన ప్రయోగాత్మకంగా సింహాద్రిపురం మండలం కాంబల్లె, గురిజాల తదితర గ్రామాల్లో ఎర్ర మిరప పంటను రైతులు సాగు చేశారు. కాంబల్లెకు చెందిన రైతు రవిశంకర్‌రెడ్డి తన 4 ఎకరాల పొలంలో ఎర్ర మిరప పంటను సాగు చేశాడు. ఎకరాకు 10 క్వింటాళ్ల ఎర్ర మిరప పంటను వచ్చిందని రైతు తెలిపారు. అదే అకాల వర్షం లేకుంటే ఎకరాకు 20 క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చేదని తెలిపారు. అయితే సీజన్ బట్టి ఈ మిరప ధర రూ.20 వేల నుంచి రూ.35 వేల వరకు ఉంటుందని తెలిపారు. పండించిన పంట కర్ణాటకలోని బ్యాడికి మార్కెట్‌లో రాయలసీమ మిర్చికి మంచి ధర పలకడంతో క్వింటా రూ.30 వేల ధర ఉండటంతో మంచి ఆదాయం వచ్చిందని రైతు సంతోషం వ్యక్తం చేశాడు. దీనికి వ్యవసాయ అధికారులు కూడా రైతులు పంట మార్పిడి చేసుకుంటే దిగుబడులు బాగా వస్తాయని.. పంట మార్పిడి తప్పక పాటించాలని తెలిపారని రైతు తెలిపారు.

### ఈ పంటలో ఎక్కువ లాభాలు వస్తున్నాయి..



నాలుగు ఎకరాల పొలంలో ఎర్ర మిరప పంటను వేశాను. విత్తనాలు (5531రకం) కేజీ రూ.60 వేలతో అనంతపురంలో కొనుగోలు చేసి ఎకరాకు దాదాపు రూ.1.20 లక్షలు ఖర్చు చేసి పంటను సాగు చేశాను. ఎకరాకు 10 క్వింటాళ్ల పంట వచ్చింది. ధర కూడా క్విటా రూ.30 వేలు పలుకుతోంది. అయితే దిగుబడి సమయంలో అకాల వర్షంతో ఎర్ర మిరప కాయల దిగుబడి తగ్గింది. లేకుంటే ఎకరాకు 20 క్వింటాళ్లు వచ్చేది. అయితే సీజన్ బట్టి ధరలు ఉంటాయి.

– శివశంకర్‌రెడ్డి (రైతు), కాంబల్లె

# ఉపాధి హామీ పనులు బేష్

అడిషనల్ పీడీ శివప్రసాద్


మాట్లాడుతున్న అడిషనల్ పీడీ శివప్రసాద్

**లింగాల** : 2021–22 ఆర్థిక సంవత్సరంలో లింగాల మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులు బేష్ అని ఉపాధి హామీ అడిషనల్ పీడీ శివప్రసాద్ కితాబునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై ఆయన ఓపెన్ ఫోరం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని రూ.8.27 కోట్లతో ఉపాధి హామీ పనులు జరిగాయని అందులో కూలీల వేతనాల కింద రూ.7.33 కోట్లు, మెటీరియల్ పేమెంట్ కింద రూ.94 లక్షలు వెచ్చించడం జరిగిందన్నారు. దీనిపై సామాజిక తనిఖీ బృందం పనులను పరిశీలించిందన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రజాప్రతినిధులు లేకుండా ఓపెన్ ఫోరం నిర్వహించామన్నారు. జిల్లాలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో మార్చి 31 నాటికి 78 లక్షల పని దినాలు టార్గెట్ కాగా.. ఫిబ్రవరి 17 నాటికి 69 లక్షల పనిదినాలు పూర్తి చేశామన్నారు. అందుకు సంబంధించిన వేజ్ పేమెంట్ పూర్తి స్థాయిలో చెల్లించామన్నారు. అక్కడక్కడా ఎండిపోయిన ఉద్యాన మొక్కలు, అవెన్యూ ప్లాంటేషన్ తిరిగి చేపట్టాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సుబ్బారెడ్డి, డీవీఓ యాదాంజనేయులు, పీఆర్ ఏఈ మనోహర్‌రెడ్డి, సీసీ అంజలి, ఎస్ఆర్పీ తిరుమలేసు, ఏపీఓ లావణ్య, ఉపాధి హామీ ఇంజనీర్ గంగరాజు, డీఆర్పీలు, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# కచ్చితమైన నివేదికలు ఇవ్వాలి


మాట్లాడుతున్న డ్వామా విజిలెన్స్ అధికారి యోగానందరెడ్డి

**సింహాద్రిపురం** : మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి కచ్చితమైన నివేదికలు ఇవ్వాలని డ్వామా విజిలెన్స్ అధికారి యోగానందరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం ఎంపీడీఓ అధ్యక్షతన ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్‌కు సంబంధించి కో ఆర్డినేషన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి కచ్చితమైన నివేదికలు ఇవ్వాలన్నారు. ఇంజనీర్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


పశువైద్య శిబిరంలో పాల్గొన్న పశువైద్యులు

**పులివెందుల రూరల్** : ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యులు రవీంద్రనాథరెడ్డి, మధుసూదన్‌రెడ్డిలు తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో బుధవారం నుంచి ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రీటైల్, జన కల్యాణ ట్రస్ట్ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ, ఏపీ ప్రభుత్వం రైతుల కోసం ఉచిత వైద శిబిరాలను నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా పశువైద్యులు ఆవులు, గేదేలు, మేకలకు వైద్య పరీక్షలు నిర్వహించి పశువులకు గర్భకోశ వ్యాధులు, చికిత్సలు నిర్వహించారు. నియోజకవర్గంలోని రైతులందరూ ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు అనురాధ, భార్గవి, మహర్షి, ఆదిత్య బిర్లా ఫ్యాషన్ రిటైల్ జన కల్యాణ్ ట్రస్ట్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

**పులివెందుల** : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌తో మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08568 286189, 99631 70177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## నవధాన్యాల సాగుపై అవగాహన ఉండాలి

**పెండ్లిమర్రి** : పంటలు సాగు చేసే రైతులు నవధాన్యాల సాగుపై తప్పని సరిగా అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారిని బ్లెస్సీ అన్నారు. మండలంలోని నాగాయపల్లె గ్రామంలో బుధవారం నవధాన్యాల సాగుపై రైతులకు ఆమె అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. నవ ధాన్యాలు సాగు చేయడం వల్ల భూమిలోని సూక్ష్మ జీవులు వృద్ధి చెంది సాగు చేసే పంటకు మంచి పోషకాలు అందుతాయన్నారు. ఒక ఎకరాకు 13 కేజీలు విత్తనాలు చల్లాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమల్లేశ్, ఏఈఓ గంగాధర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్ గంగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన


మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా

**వేంపల్లె** : స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో బుధవారం తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీ అని, ఆడపిల్లలను సంరక్షించడం, చదివించడం మన బాధ్యత అన్నారు. సమాజంలో ఆడ, మగ పిల్లలు ఇద్దరూ సమానమని, బాలికల సంరక్షణ, విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఏఎన్ఎం, ఆశా వర్కర్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాబితాలో మార్పులుంటే తెలపండి


మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి రమేష్

**లింగాల** : పంట నమోదు చేసుకున్న రైతులందరూ ఆర్‌బీకేలలో ఉన్న జాబితాను సరి చూసుకుని ఏవైనా మార్పులుంటే సంబంధిత ఆర్‌బీకే సిబ్బందికి తెలియజేయాలని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మురారిచింతల, లింగాల రైతు భరోసా కేంద్రాలలో రైతులకు గ్రామసభలు నిర్వహించి మాట్లాడారు. 2022–23 రబీకి సంబంధించి మండల వ్యాప్తంగా 2,523 మంది రైతులకు సంబంధించి 7,353 ఎకరాలలో పంట నమోదు చేశామని.. 99 శాతం మంది రైతులకు ఈకేవైసీ పూర్తి చేశామన్నారు. ఈ–క్రాప్ ద్వారా పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలను ఈనెల 17వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆర్‌బీకేలలో సామాజిక తనిఖీ నిమిత్తం ఉంచిన 2022–23 రబీ పంటల నమోదు జాబితాను వ్యవసాయాధికారి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌బీకేల సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీగా ఎలా గెలిచావో గుర్తుచేసుకో

- బీటెక్ రవిపై వైఎస్సార్‌సీపీ నాయకుల ఆగ్రహం


మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ లింగాల మండల నాయకులు

**పులివెందుల** : ఒక ఎమ్మెల్సీగా ఉండి గన్‌మెన్లు, అనుచరులను వెంటబెట్టుకుని పోలింగ్ కేంద్రాలలోకి వెళ్లకూడదన్న ఇంగిత జ్ఞానం కూడా లేకుండా ప్రవర్తించిన నువ్వు ఎమ్మెల్సీగా ఎలా గెలిచావో గర్తుచేసుకోవాలని వారు బీటెక్ రవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో వైఎస్సార్‌సీపీ లింగాల మండల నాయకులు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. లింగాల పోలింగ్ కేంద్రం వద్ద బీటెక్ రవి గొడవలు సృష్టించి పోలింగ్ కేంద్రంలోకి చొరబడేందుకు యత్నించగా అక్కడే ఉన్న ఓటర్ల తిరుగుబాటుతో అడ్డంగా దొరికిన దొంగవు నీవు అని విమర్శించారు. ప్రజల సానుభూతి పొందేందుకు ఏ పాపం తెలియని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఆయన వ్యక్తిగత సహాయకుడు రాఘవరెడ్డి పేర్లను, పార్టీని బదన్నాం చేసేలా మాట్లాడటం మీ సిగ్గుమాలిన బతుకులకు నిదర్శనమన్నారు. బీటెక్ రవి నువ్వు ఎమ్మెల్సీగా గెలిచిన చరిత్రను బయటకు తీద్దాం.. పూర్తి మెజార్టీ వైఎస్సార్‌సీపీకి ఉన్నా నువ్వు, మీ చంద్రబాబు కలిసి ఎంపీటీసీలను ఎలా కొనుగోలు చేశారో.. ఏ ఏ మోసాలు చేశావో.. ఎలా అడ్డదారులు తొక్కి గెలిచావో జిల్లా ప్రజలందరికీ తెలుసు అని విమర్శించారు.

గతంలో సింహాద్రిపురం మండలంలో ఒక ఎంపీటీసీగా ఓడిపోయిన చరిత్ర నీది. ఎమ్మెల్సీగా ఎన్నికై ఆరేళ్లవుతున్నా నియోజకవర్గానికి కానీ, జిల్లాకు గానీ మీ హయాంలో ఏమి అభివృద్ధి చేశారో ప్రజలకు వెల్లడించాలన్నారు. నీ పేరుకు తోకలోనే బీటెక్ అని ప్రచారం చేసుకుని ఓటేందుకు ఎక్కించుకోలేదు, నిజంగా బీటెక్ చేశావా లేక దొంగ సర్టిఫికెట్లా.. లేక రాంగోపాల్‌రెడ్డిపై కోపంతోనే ఎక్కించుకోలేదా.. రాష్ట్రం, జిల్లా, మన పులివెందుల అభివృద్ధిలో పరుగులు పెడుతోందంటే మన సీఎం వైఎస్ జగన్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల సమష్టి కృషి అని చెప్పక తప్పదని.. ఇలాంటి మచ్చలేని నాయకులపై బురదజల్లాలనుకుంటే ఆకాశంపై ఉమ్మేసినట్లవుతుందన్నారు. ప్రతి పల్లెలో చిచ్చు పెట్టాలని, ఆ మంటలో చలి కాచుకోవాలనే నీ దుర్బుద్ధిని, నీ మనస్తత్వాన్ని గుర్తించి ప్రజలే తరిమి తరిమి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. వివేకా హత్య కేసు గురించి మాట్లాడటం వల్లే దాడి చేశారని చెప్పుకోవడానికి నీకు(బీటెక్ రవి) సిగ్గుండాలని విమర్శించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ లింగాల మండల నాయకులు ఎం.బాబురెడ్డి, కర్ణా రమేష్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లికేశవరెడ్డి, వెంకట్రామిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, నిరంజన్, అనిల్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, విద్యానందరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, గంగిరెడ్డి, భాస్కర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన ఉండాలి

**కడప కోటిరెడ్డిసర్కిల్** : చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బాలల పరిరక్షణ విభాగం సామాజిక కార్యకర్త బి.వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం నగర శివార్లలోని రిమ్స్ ప్రభుత్వ ఆస్పత్రిలో నర్సింగ్ కళాశాల విద్యార్థులకు బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ నిషేధ చట్టం, బాల్య వివాహ నిషేధ చట్టం, బాలల న్యాయ చట్టం, లైంగిక వేధింపుల నుంచి రక్షణ చట్టం గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. బాల బాలికలకు ఒక రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. బేటీ బచావో–బేటీ పడావో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు


పులివెందులలో పరీక్షలు రాస్తున్న ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు

**కమలాపురం** : ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. బుధవారం ఫస్టియర్ విద్యార్థులకు తెలుగు పరీక్ష కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య అధికారులు నిర్వహించారు. పట్టణంలోని గురుకుల పాఠశాల, పీవీఎస్ఆర్ఎం జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. గురుకుల కేంద్రంలో 253 మంది విద్యార్థులకు గాను 239 మంది హాజరయ్యారని, 14 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరిటెండెంట్ తులశమ్మ, డిపార్ట్‌మెంట్ అధికారి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. అలాగే పీవీఎస్ఆర్ కళాశాల కేంద్రంలో 223 మందికి 211 మంది హాజరైయ్యారని 12 మంది గైర్హాజరయ్యారని చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులు రత్నం, రషీద్ తెలిపారు.

**పులివెందులలో..**

**పులివెందుల టౌన్** : రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల, సాయిచైతన్య జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాశారు. విద్యార్థులను ఉదయం 8.30గంటలకే పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా నిర్వహించడంతో పరీక్షలు ప్రశాంతంగా రాశారు. నేటి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేశారు.

**లింగాలలో..**

**లింగాల** : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. పరీక్షా కేంద్రంలో ఇప్పట్ల గ్రామ సమీపంలోని ప్రతిభా గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినులు, లింగాల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 98 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 95 మంది హాజరయ్యారని ఎగ్జామినేషన్ చీఫ్ రాజశేఖరరెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని స్టేట్ అబ్జర్వర్ రవిశంకర్ నాయక్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా నిత్యపూజితయ్య వ్యవహరించారు.


కమలాపురంలో గురుకుల పాఠశాల వద్ద విద్యార్థులు


జమ్మలమడుగు : ప్రభుత్వ బాలికల కళాశాలలో పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థినులు


**జమ్మలమడుగులో..**

**జమ్మలమడుగు రూరల్** : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. వివేకానంద కళాశాలలో 165 మంది విద్యార్థులకు గాను 158 మంది, సాయిపరమేశ్వర కళాశాలలో 196 మంది విద్యార్థులకు గాను 192 మంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 241 మందికి గాను 228 మంది, బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 234 మంది విద్యార్థులకు గాను 224 హాజరైనట్లు తెలిపారు.

## 18 నుంచి షహమీరియా దర్గా ఉరుసు


**కడప కల్చరల్** : స్థానిక రవీంద్రనగర్‌లోని ఆస్తానే షహమీరియా దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆస్తానే షహమీరియా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా హుసేనీబాషా షహమీరి తెలిపారు. షహమీరియా దర్గాలోని హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అబ్దుల్ హఖ్ ఉరఫ్ షహమీర్‌బాషా చిష్టివుల్ ఖాద్రీ సాహెబ్ పేరిట ఈ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. శనివారం సాయంత్రం అసర్ నమాజ్ అనంతరం గంధం ఉత్సవం నిర్వహిస్తామని, అనంతరం నాతియా మెహఫిల్, అన్నదాన కార్యక్రమం ఉంటాయని తెలిపారు. 19న సెమినార్ కార్యక్రమం వైట్‌హౌస్ ఫంక్షన్ హాలులో ఉంటుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు ఉర్దూ యూనివర్సిటీ మాజీ వీసీ మౌలాన రాహిఫిదాయి రానున్నారు.

## సహకార బ్యాంకులతో రైతులకు విశిష్ట సేవలు


రైతులతో మాట్లాడుతున్న అప్కాబ్ రాష్ట్ర చైర్మన్ మల్లెల ఝాన్సీ రాణి

**చింతకొమ్మదిన్నె** : వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు మెరుగైన విశిష్ట సేవలు అందుబాటులోకి వచ్చాయని అప్కాబ్ రాష్ట్ర చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి అన్నారు. బుధవారం చింతకొమ్మదిన్నెలోని సహకార బ్యాంకులో రైతులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు కావాల్సిన అన్ని సదుపాయాలను అందిస్తున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా రైతులకు బంగారుపై రుణాలను అందించేందుకు వ్యవసాయ కేంద్ర బ్యాంకు ముందుకు వచ్చిందన్నారు. గరిష్టంగా రైతుకు రూ. 5లక్షల వరకు ఎలాంటి చార్జీలు లేకుండా రుణాలను అందించనున్నామన్నారు. అనంతరం వ్యవసాయ కేంద్ర బ్యాంకులో బంగారును ఉంచుకునేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ ఆమె ప్రారంభించారు.కార్యక్రమంలో కేంద్ర సహకార బ్యాంకు సీఈవో రాజేంద్ర కుమార్, నాబార్డు డీడీఎం విజ విహారి, డీసీసీ బ్యాంకు అడ్వయిజర్ సహదేవ రెడ్డి, పిఎసీఎస్ డెవలప్‌మెంట్ ఏజీఎం వీరశంకర్, డైరెక్టర్లు విశ్వనాథరెడ్డి, సుబ్బరామిరెడ్డి, సికెదిన్నె, నాగిరెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షులు శ్రీరామిరెడ్డి, రాజారెడ్డి, మండల మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిధుల వినియోగంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి

**వైవీయూ**: జాతీయ సేవా పథకం నిధుల వినియోగంపై ప్రోగ్రాం ఆఫీసర్లకు అవగాహన అవసరమని వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైవీయూలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఆఫీసర్లకు పబ్లిక్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ సిస్టం (పీఎఫ్ఎంఎస్)పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధుల వినియోగంలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ నిధులన్నీ ఆన్‌లైన్ విధానంలో ఖర్చుచేయాలని సూచించారు. విజయవాడ జాతీయ సేవాపథకం రాష్ట్ర కార్యాలయ రీసోర్స్ పర్సన్ దూపూడి మనోహరి, పి.శివకాంత్‌లు పబ్లిక్ ఫైనాన్స్ సెల్ మేనేజ్‌మెంట్ సిస్టం గురించి పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు.



## క్లుప్తంగా

### జూదరుల అరెస్ట్

**జమ్మలమడుగు** : మండల పరిధిలోని సున్నపు రాళ్లపల్లె గ్రామంలో బుధవారం రాత్రి జూద మాడుతున్న 9 మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.14,800 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పట్టణ సీఐ సదా శివయ్య తెలిపారు. ముందస్తు సమాచార మేరకు సిబ్బందితో దాడి చేసినట్లు ఆయన తెలిపారు.

### ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు


అవగాహన కల్పిస్తున్న పీఆర్పీ శ్రీనివాసులు

**సింహాద్రిపురం** : ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అధిక లాభాలు వస్తాయని ప్రకృతి వ్యవసాయ పీఆర్పీ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సింహాద్రిపురం గ్రామంలోని వ్యవసాయ మండల సలహా బోర్డు చైర్మన్ అరవిందనాథరెడ్డి చీనీ తోటలో ప్రకృతి వ్యవసాయ ద్రావణాలు తయారు చేసుకోవడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీఆర్పీ మాట్లాడుతూ దశపర్ని ద్రావణం తయారు చేసుకోవడంవల్ల పంటలలో పురుగులను, తెగుళ్లను నివారించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

### యోగాతో మానసిక జబ్బులు దూరం


యోగాశిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

**కొండాపురం** : ప్రతిరోజు యోగా చేయడం వల్ల మానసిక జబ్బులు దూరం అవుతాయని డాక్టర్ వై.సాంబశివారెడ్డి తెలిపారు. బుధవారం కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు హెల్త్ మేళాలో భాగంగా తాళ్లప్రొద్దుటూరు సీహెచ్ఓ, కొండాపురం సీహెచ్ఓ కలసి యోగ శిక్షణ శిబిరం నిర్వహించి మాట్లాడారు. యోగ ఆసనాలతో బి.పి, షుగర్, థైరాయిడ్ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు అని తెలిపారు. శారీరక, మానసిక వికాసానికి యోగాసనం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. యోగ శిక్షణ శిబిరం రెండు రోజులపాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కళావతి, సత్యవాణి, బాల నరసింహులు, ధనలక్ష్మీ, రాము, శివశంకర్ పాల్గొన్నారు.

### 17న వైవీయూలో కవయిత్రి మొల్ల సప్తశత జయంతి సభ

**వైవీయూ** : యోగివేమన విశ్వవిద్యాలయం, మొల్ల సాహితీపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17న కవయిత్రి మొల్ల సప్తశత జయంతి సభ నిర్వహించనున్నట్లు వైవీయూ తెలుగుశాఖ విభాగాధిపతి ఆచార్య జి. పార్వతి తెలిపారు. వైవీయూలోని అర్ట్స్‌బ్లాక్ సెమినార్ హాల్లో నిర్వహించే ఈ సభకు వీసా ఆచార్య జింక రంగ జనార్దన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య తదితరులు హాజరవుతారన్నారు.

### కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా జనార్దన్

**కడప కోటిరెడ్డిసర్కిల్** : కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.జనార్దన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మార్రెళ్ల యానాదయ్య భారతి సిమెంటు ఫ్యాక్టరీ గూడ్స్ సూపర్‌వైజర్‌గా బదిలీ అయ్యారు. 2018లో ఆర్ఆర్‌బీ ద్వారా ఎంపికైన జనార్దన్ ముద్దనూరు రైల్వేస్టేషన్‌లో కమర్షియల్ సూపర్‌వైజర్‌గా పనిచేశారు. ఆ తర్వాత పదోన్నతిపై కడప కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

### కారుణ్య నియామకం

**కడప అర్బన్** : హోంగార్డు వై. శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఈ నేపథ్యంలో ఆయన తనయుడు వై. వెంకటేష్‌కు కారుణ్య నియామకం కింద హోంగార్డుగా నియమించారు. ఈ మేరకు నియామకపత్రాన్ని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఏఆర్ డీఎస్పీ బి. రమణయ్య, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు, దివంగత హోంగార్డు సతీమణి, వై. రమాదేవి పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో కాలబైరవాష్టమి



**కడప కల్చరల్** : కడప నగర శివార్లలోని మగ్దూం సాహెబ్ కొట్టాల, కాలబైరవపురంగ్రామంలోని శ్రీ ఇష్టకామ్యార్థ కాలబైరవస్వామి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో కాలాబైరవాష్టమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీధరశర్మ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం, విశేష అలంకారం, అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. భక్తులు సామూహికంగా కాలబైరవ అష్టకాన్ని పఠించారు. ఆలయ ధర్మకర్త మేరువ బాలాజీరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.